# కవిత అరెస్టు రాజకీయ కుట్రే

- బీఆర్ఎస్ నేతల ఆగ్రహం • ఇది అప్రజాస్వామికమంటూ మండిపాటు

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో రాజకీయ కుట్రలో భాగంగానే ఆమెను అరెస్టు చేశారంటూ మండిపడుతున్నారు. కేసు విచారణలో ఉన్నందున అరెస్ట్ చేయబోమని సుప్రీం కోర్టుకు మాట ఇచ్చి... ఇప్పుడెలా తప్పుతున్నారని ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు రోజే అరెస్టు చేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను నైతికంగా దెబ్బ తీసే ప్రయత్నయని, ఇది అప్రజాస్వామికం, అనైతికం, అక్రమమని తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.**


బీఆర్ఎస్ కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

### ❖ బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేకే నీచ రాజకీయాలు



పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక బీజేపీ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నది. ఎమ్మెల్సీ కవిత కేసు కోర్టులో విచారణలో ఉండగా, ఇప్పుడు అరెస్టు చేయడం సరికాదు. దర్యాప్తు సంస్థలు బీజేపీ ప్రభుత్వానికి వత్తాసు పలకడం ఏ మాత్రం సరికాదు. మోదీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతోనే విచారణ పేరుతో కవితను అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం. బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని బీజేపీ ప్రభుత్వం దిగుజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నది. ప్రతిపక్షాల నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారు. **-జోగు రామన్న, మాజీ మంత్రి**

### ❖ బ్రిటీష్ పాలనను తలపిస్తున్నది



కేంద్రం తీరు బ్రిటీష్ పాలనను తలపిస్తున్నది. ప్రజాసమస్యల పరిష్కారం కోసం గళమెత్తుతున్న ప్రతిపక్ష నాయకులపై బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది. నిరంకుశ ధోరణి అవలంబిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యే కవితను ఈడీ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. కేంద్ర పరిధిలోని సీబీఐ, ఈడీ, ఐటీలాంటి సంస్థలను బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నది. ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారు. **- అనిల్ జాదవ్, ఎమ్మెల్యే బోథ్**

### ❖ ఇది ముమ్మాటికీ కుట్రే..



నిర్మల్, మార్చి 15: బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నం. ఇందులో ముమ్మాటికీ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కుట్ర ఉన్నట్లు స్పష్టమవుతున్నది. రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బకొట్టేందుకే ఈ రెండు పార్టీలు కుట్రలు పన్నుతున్నాయి. ఈ కేసులో ఎలాంటి బలం లేదు. ఎమ్మెల్సీ కవిత తన నిజాయితీని నిరూపించుకొని నిర్దోషిగా బయటకు వస్తారు. **- లోలం శ్యాంసుందర్, జడ్పీ మాజీ చైర్మన్**

### ❖ అరెస్టు అన్యాయం



నిర్మల్, మార్చి, 15: ఎమ్మెల్సీ కవితకు సంబంధించిన లిక్కర్ కేసు సుప్రీం కోర్టులో విచారణలో ఉండగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఈడీ అధికారులు అరెస్టు చేయడం అన్యాయం . పూర్తిగా చట్టాన్ని అతిక్రమించడమే అవుతుంది. రాజకీయంగా కేసీఆర్‌ను ఎదుర్కొనలేక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అక్రమ అరెస్టులకు పాల్పడుతూ పార్టీని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయి. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు పొందవచ్చనే దురాలోచనతోనే బీజేపీ ఈడీని ఉసిగొల్పి అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నది. తెలంగాణ ప్రజలు అంతా గమనిస్తున్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు గుణపాఠం తప్పదు.
**- వీ సత్యనారాయణ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి**


నేరడిగొండలో సాఫ్ట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# క్రీడల్లో రాణించాలి

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ • సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

నేరడిగొండ, మార్చి 15: క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మండల కేంద్రం లో నిర్వహించిన 8వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ ఇంటర్ బాలికల జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీలకు హాజరై మాట్లాడారు. చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడల్లో రాణించి ప్రాంత పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఎంపీపీ రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు సయ్యద్ జహీర్, ఎంపీటీసీ పండరి, నాయకులు తిరుమల్‌గౌడ్, అనిల్ యాదవ్, గులాబ్‌సింగ్, గణేశ్, విలాస్, కైలాస్, సురేందర్, క్రీడల నిర్వాహకులు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

### టీకాలు వేయించాలి

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సూచించారు. నేరడిగొండలోని పశువైద్య కేంద్రంలో శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు తమ పశువులకు టీకాలను వేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, ఏడీఏహెచ్ డాక్టర్ రామారావ్, మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, మాజీ సర్పంచ్ పెంట వెంకటరమణ, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సయ్యద్ జహీర్, గులాబ్‌సింగ్, ప్రతాప్‌సింగ్, అనిల్‌యాదవ్, డాక్టర్ సుశీల్, సిబ్బంది పాల్గొన్నారు.

## హెవీ వెహికల్ డ్రైవర్ శిక్షణ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 15 : టీఎస్ ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హెవీ మోటర్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. దీనికి ఫీజు రూ.15600 ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు తప్పనిసరిగా లైట్ మోటర్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాచ్ నంబర్ కలిగి ఉండాలని తెలిపారు.

## నేడు జాతీయ లోక్ అదాలత్

బోథ్, మార్చి 15 : బోథ్ కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి బీ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం బోథ్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న కేసులు, బ్యాంకు కేసులు పరిష్కారమయ్యే విధంగా న్యాయవాదులు చొరవ చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలి

నేరడిగొండ, మార్చి 15 : గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని ఎంపీడీవో రజ్వీర్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం బంధంరేగడి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల శాతం పెంచాలని సిబ్బందికి సూచించారు. మస్టర్‌లో కూలీల హాజరుశాతాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో వసంత్‌రావ్, టీఏ లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

## పశు సంపదను కాపాడుకోవాలి

ఉట్నూర్ రూరల్, మార్చి 15: రైతులు పశు సంపదను కాపాడుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం పెర్కగూడ గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి కిషన్, వైస్ ఎంపీపీ బాలాజీ, పశు వైద్యాధికారి రమేశ్, మాజీ సర్పంచ్ హరినాయక్, గ్రామ పెద్ద లింగన్న, రైతులు పాల్గొన్నారు.

ఇచ్చోడ, మార్చి 15 : ముక్రా(కే) గ్రామ పంచాయతీ పరిధిలో పశువైద్యాధికారి గోవింద్ నాయక్ పాడి పశువులు, ఎడ్లకు టీకాలు వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్, సిబ్బంది శేఖర్, దేవ్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

బోథ్, మార్చి 15 : ఘన్‌పూర్ గ్రామంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ రూ.3 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఎంపీటీసీ సునీతారోహిదాస్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ సుదర్శన్, గుండెరావ్, జాదవ్ విక్రమ్, సంతోశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

గుడిహత్నూర్, మార్చి 15 : గుడిహత్నూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేతకాని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి రవీందర్ తండ్రి లింగయ్య స్మారకార్థం ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్ శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దేవదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రీషియన్‌పై దాడి

ఉట్నూర్ రూరల్, మార్చి 15 : లక్కారం గ్రామ పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న గొడిపెల్లి సోముపై శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు తనపై కత్తితో దాడి చేసి, పరారయ్యారు. గమనించిన స్థానికులు బాధితుడిని వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు, మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు రెఫర్ చేశారు.

## పోస్టాఫీస్ ఎదుట రైతుల ఆందోళన

ఆదిలాబాద్ రూరల్, మార్చి 15 : ఆదిలాబాద్ ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ జాదవ్ విజయ్ సీసీఐకి పత్తి విక్రయించిన రైతుల డబ్బులను కాజేసిన విషయం తెలిసిందే. శుక్రవారం బాధిత రైతులు ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ అధికారులను నిలదీశారు. పలు రైతుల ఖాతా నుంచి సుమారు రూ. రెండు కోట్ల వరకు కాజేసినట్లు వాపోయారు. రైతుల ఆందోళన నేపథ్యంలో పోస్టాఫీస్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వడ్డీ లేని రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్, మార్చి 15 : మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా అందించే వడ్డీలేని రుణాలు సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం నరేందర్ అన్నారు. శుక్రవారం తాడిహత్నూర్ గ్రామంలో గణపతి మహిళా స్వయం సహాయక సంఘానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రూ.18లక్షలు మంజూరు చేసిన పత్రాన్ని మహిళ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం మైస రమేశ్, ఫీల్డ్ అధికారి సునీల్, డీఎంజీ రాజేందర్, సీసీలు శ్రీరామ్, రాథోడ్ సంతోశ్, వీవోఏ విజయ్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మండలాభివృద్ధికి కృషి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 15 : మండలాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నామని జడ్పీటీసీ నల్ల వనిత పేర్కొన్నారు. మండలంలోని వాఘాపూర్‌లో ముఖ్య కూడలి వద్ద రూ.5 లక్షల జడ్పీ నిధులతో ఏర్పాటు చేయనున్న హైమాస్ట్ లైటింగ్ పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీత, ఎంపీటీసీ ఈశ్వరి, నాయకులు నల్ల రాజేశ్వర్, ఎవన్, గోవర్ధన్ రెడ్డి, విలాస్ రెడ్డి పాల్గొన్నారు.

## శ్మశాన వాటికలో పని చేయని బోరు


బజార్‌హత్నూర్‌లోని శ్మశాన వాటికలో పని చేయని బోరు

బజార్‌హత్నూర్, మార్చి 15: బజార్‌హత్నూర్‌లోని శ్మశాన వాటికలో బోరు పని చేయకపోవడంతో ఖననం చేసే సందర్భంలో నీటి తిప్పలు తప్పడం లేదు. శుక్రవారం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు చనిపోవడంతో గ్రామస్తులు మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకొని వచ్చి దహన సంస్కారాలు పూర్తి చేశారు. తిరిగి ఇంటికి వెళ్లే సందర్భంలో గ్రామస్తులు, బంధువులు శ్మశాన వాటికలోని బోరుబావి వద్ద స్నానాలు చేద్దామంటే బోరు పని చేయకపోవడంతో నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలైన నీటి వసతి కూడా సరిగా లేక పోవడంతో దహన సంస్కారాలకు వచ్చిన వారందరు గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు చొరవ తీసుకొని శ్మశాన వాటికలోని బోరును బాగు చేసి నీటి కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

## రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్, మార్చి 15 : దీపాయిగూడ గ్రామంలో రూ.3 లక్షలతో చేపడుతున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో దీపాయిగూడ ఎంపీటీసీ లోక కరుణాకర్ రెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, రమేశ్, రాజు, రైతులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 15 : ఆదిలాబాద్ రూరల్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం సాదాసీదాగా సాగింది. రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేశ్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండల ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడంలో జరిగిన లోపాలను సభ్యులు నిలదీశారు. కొందరు పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో పేద ప్రజలకు అందే సంక్షేమ ఫలాలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. యాపల్‌గూడ కార్యదర్శి నసీమా.. అర్జీదారుడిపై దురుసుగా మాట్లాడి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నందున ఆమెను సరెండర్ చేస్తూ సభలో సభ్యులు అమోదిస్తూ ఉన్నతాధికారులకు పంపాల్సిందిగా తీర్మానించారు. అలాగే గైర్హాజరైన పలువురు అధికారులను కూడా వివరణ కోరాల్సిందిగా, సభ్యులు సూచించారు. వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి, విద్యుత్ సరఫరాపై ప్రధానంగా చర్చ కొనసాగింది. ఈ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## కేసీఆర్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

తాంసి, మార్చి 15 : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మన ఊరు–మన బడి కార్యక్రమంతో కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని మాజీ సర్పంచ్ కేమ సదానందం అన్నారు. కప్పర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రూ.13 లక్షల 50 వేలతో సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ అదనపు గదుల నిర్మాణానికి నాయకులతో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కౌడాల భాగ్యలక్ష్మి సంతోష్, మాజీ సర్పంచ్ కౌడాల నారాయణ, మాజీ ఉపసర్పంచ్ రేణు క రాజ్‌కుమార్, నాయకులు గండ్రత్ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు ఆనంద్‌రావ్, మల్లన్న, జేఈ సమంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వినియోగదారులు హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలి

జైనథ్, మార్చి 15: సమాజంలోని వినియోగదారులందరూ వారి హక్కులు బాధ్యతల గురించి తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వర ప్రసాద్ అన్నారు. శుక్రవారం సావాపూర్ గ్రామంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, సావాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు


బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే కోవలక్ష్మి, గాదిగూడ వైస్ ఎంపీపీ మర్సుకోలే యోగేశ్

నార్నూర్, మార్చి 15: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి గాదిగూడ వైస్ ఎంపీపీ యోగేశ్ శుక్రవారం తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు సైనికుల్లా పని చేయాలని,బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారని తెలిపారు. ఇక్కడ గాదిగూడ మండల ముఖ్య నాయకులు ఉన్నారు.

# నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి


పాల్గొన్న ఉమ్మడి జిల్లా అధికారులు

ఉట్నూర్, మార్చి15 : వేసవి ప్రారంభమైనందున తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. కుమ్రం భీం ప్రాంగణంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పని చేసి, జిల్లాను అగ్రగ్రామిగా నిలపాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అలాగే యువత గంగజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్లు రాజర్షిషా, ఆశీష్ సాంగ్వాన్, బదావత్ సంతోష్, వెంకటేశ్, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మహిళకు జ్ఞాపిక అందజేసి, శాలువాతో సత్కరిస్తున్న మాజీమంత్రి జోగు రామన్న

ఎదులాపురం,మార్చి 15: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పట్టణంలోని తాలూకా మున్నూరు కాపు సంఘం భవనంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురిని శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. మాజీ మంత్రిని కూడా శాలువాలతో సత్కరించారు. ఈ మేరకు మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. సంఘ చైతన్యం కోసం మహిళలు ముందుకు రావడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే బతుకమ్మ సంబురాలు, వినాయక నవరాత్రి వేడుకలు, దసరా నవరాత్రోత్సవాలను విజయవంతం చేయడంలో మహిళా సభ్యులు కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. కార్యక్రమంలో తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కాళ్ల విఠల్, మహిళా విభాగం అధ్యక్షురాలు దేశెట్టి ప్రభ, జోగురమణి, సంధ్య, వార్డు కౌన్సిలర్ సంద నర్సింగ్ తదితరులన్నారు.

## సంఘం బలోపేతానికి కృషి చేయాలి

నేరడిగొండ, మార్చి 15 : సహకార సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ సాబ్లే కిశోర్‌సింగ్ అన్నారు. శుక్రవారం నేరడిగొండ పీఏసీఎస్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ పెండింగ్ రుణాల వసూళ్లను చేపట్టాలన్నారు. అనంతరం జమ, ఖర్చుల గురించి సీఈవో వివరించారు. కార్యక్రమంలో సీఈవో నాగభూషణ్, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 15: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బోథ్ మండలానికి చెందిన కృష్ణ శుక్రవారం ద్విచక్రవాహనంపై మామిడిగూడ వైపు వెళ్తుండగా అనుకుంట గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న మైలురాయిని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించగా క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు.

## పాలిసెట్-2024పై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, మార్చి 15 : జిల్లా కేంద్రంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది పాలిసెట్–2024పై శుక్రవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో పాలిసెట్ ప్రవేశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏప్రిల్ 22వ తేదీలోపు పాలిసెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భరద్వాజ్ సూచించారు. మే 17న పవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

# వారానికి ఒక్కరోజే వైద్యుడి సేవలు

- చర్యలు తీసుకోవాలని పిట్టబొంగురం గ్రామస్తుల రాస్తారోకో


పీహెచ్‌సీ గేట్ ఎదుట రాస్తారోకో చేస్తున్న పిట్టబొంగురం గ్రామస్తులు

ఇంద్రవెల్లి, మార్చి15: వారానికి ఒక్కరోజే విధులకు వస్తున్న వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని పిట్టబొంగురం గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం పీహెచ్‌సీ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ. ఆదివాసీ గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాల్సిన వైద్యుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. వైద్యుడు రాకపోవడంతో, పీహెచ్‌సీలో కిందిస్థాయి సిబ్బందే రోగులకు వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే వైద్యుడిని నియమించాలని కోరారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పీహెచ్‌సీని సందర్శించి, వైద్యుడిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి తీసుకుంటామని చెప్పారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. గ్రామపటేల్ వెట్టి రాజేశ్వర్, గ్రామస్తులు ఎర్మ పైకు, వెట్టి జాకేశ్వర్, సిడాం భీంరావ్, మడావి ఇంద్రదేవ్ పాల్గొన్నారు.

# రిమ్స్ కార్మికుల సమ్మె విరమణ


సమ్మె విరమిస్తున్నట్లు వినతిపత్రం ఏజెన్సీ నిర్వాహకుడికి అందజేస్తున్న కార్మికులు, సంఘం నాయకులు

ఎదులాపురం, మార్చి15 : రిమ్స్ కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రధాన గేటు ఎదుట చేపట్టిన సమ్మె శుక్రవారంతో ముగిసింది. సమ్మె శిబిరానికి వచ్చిన ఏజెన్సీ నిర్వాహకుడు ఎన్ వేణుకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ కార్మికుల డిమాండ్‌కు సంబంధించిన వినతిపత్రం అందజేశారు. డిమాండ్‌లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సమ్మె చేయడంతో రిమ్స్‌కు వచ్చే రోగులు ఇబ్బందులు గురువుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, రిమ్స్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసీం, అధ్యక్షురాలు సంగీత, సీనియర్ నాయకులు లస్మక్క, కమలమ్మ, గంగమణి పాల్గొన్నారు.

# పేదల కోసమే గిరిజన క్యాంటీన్

- మంత్రి సీతక్క

ఉట్నూర్, మార్చి15: పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెట్టేందుకే రూ. 5కి భోజనం ఏర్పాటు చేశామని రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. స్థానిక జీసీసీ పెట్రోల్ బంక్ సమీపంలోని గిరిజన భవన్‌లో శుక్రవారం రూ. 5కే భోజనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడమే తమ ప్రభుత్వ ఆశయమన్నారు. ఈ భోజనం ఏర్పాటు చేయడం ద్వారా నాలుగు కొలాం కుంటుంబాలకు ఉపాధి లభించినట్లు తెలిపారు. శాశ్వత షెడ్డు ఏర్పాటు చేసేందుకు టెండర్ ఖరారు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ఎస్పీ గౌస్ ఆలం, డీడీ దిలీప్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాంట్రాక్ట్ బోధనేతర సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్, ఉపాధ్యక్షుడు సుంగులు మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, ప్రకాశ్, మోరేశ్ పాల్గొన్నారు.

### సౌకర్యాలు కల్పించాలి

ఉట్నూర్ రూరల్, మార్చి 15: గోండి భాష పరిరక్షణ, జంగుబాయి దీక్ష భూమి జంగావ్‌లో సౌకర్యాలు కల్పిస్తూ ఆదివాసులకు సెలవులు మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు శుక్రవారం కేబీ కాంప్లెక్స్‌లోని పీఎంఆర్సీ భవన్‌లో రాజ్ గోండ్ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావ్ వినతిపత్రం ఇచ్చారు. గోండి సంప్రదాయాల రక్షణ కొరకు ప్రభుత్వం పుస్తక రూపంలో తయారు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా జంగు బాయి దీక్ష చేపడుతున్నందున సెలవులు ప్రకటించాలని కోరారు.


భోజనం వడ్డిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు

## దరఖాస్తు చేసుకోవాలి

తాంసి(భీంపూర్), మార్చి 15 : భీంపూర్ మండలంలో గృహజ్యోతి జీరో బిల్లులు రాని వారు శనివారంలోగా మండల పరిషత్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్, ప్రజాపాలన రసీదు, మీటర్ నంబర్ ఇవ్వాలని సూచించారు.